సాక్షి
తూర్పుగోదావరి
శనివారం । 22 । ఫిబ్రవరి । 2025



భూములు స్వాధీనం చేసుకోండి

కోటిపల్లి – నరసాపురం రైల్వేలైన్ నిర్మాణానికి రైతుల నుంచి సేకరించిన భూమిని కలెక్టర్ స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు.


8లో



కనులకు అందం.. కవలల బంధం

సృష్టిలో మనిషిని పోలిన మనుషులు ఏడుగురు ఉంటారంటారు. అలాంటి ఏడుగురు మనకు కనిపిస్తారో లేదో తెలియదు కానీ మన చుట్టుపక్కల కవలలను చూస్తే నిజమేనని అనిపిస్తుంది.

8,700 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 8,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,600, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్ట 9.65 అడుగులకు చేరింది.

దేచెర్లలో ఎర్రమట్టి దొంగలు

- 150 ఎకరాల్లో అక్రమ తవ్వకాలు
- రోజుకు 200 లారీలకు పైగా తరలింపు
- నెలలుగా సాగుతున్న దందా
- అనుమతులు లేకుండానే యథేచ్ఛగా రవాణా
- బరి తెగిస్తున్న కూటమి నేతలు
- సహజ సంపద దోచుకుంటున్న వైనం
- మామూళ్ల మత్తులో జోగుతున్న మైనింగ్ అధికారులు



సాక్షి, రాజమహేంద్రవరం: సహజ సంపద దోపిడీయే ధ్యేయంగా కూటమి నేతలు బరి తెగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అడ్డగోలు వ్యవహారానికి తెర తీశారు. అనుకున్నదే తడవుగా అక్రమాలకు తెర తీశారు. గ్రావెల్, మట్టి, ఇసుక ఇలా ప్రకృతి సంపదను కొల్లగొట్టి రూ.కోట్లు దండుకుంటున్నారు. అధికార పార్టీ నేతలు కావడం, తమను అడ్డుకునే వారెవరన్న ధీమాతో చెలరేగిపోతున్నారు. కూటమి ఎమ్మెల్యేల అండదండలు పుష్కలంగా వారి ఉండటంతో వారి అనుచరులు ఎర్రమట్టి దొంగల అవతారం ఎత్తారు. ఎంతగా అంటే దోపిడీ మూడు ట్రాక్టర్లు.. ఆరు లారీలు అన్న చంద్రంగా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమాన్ని అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం కాసుల కక్కుర్తితో అటువైపు కన్నెత్తి చూడటం లేదు. మామూళ్ల దండుకుని తమ కేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం మట్టి తవ్వకాలతో సమీప ప్రాంతాల ప్రజలు విసుగెత్తిపోతున్నారు. ఇదేమీ దోపిడీ అంటూ విస్తుపోతున్నారు.

అనధికార తవ్వకాలు

కొవ్వూరు నియోజకవర్గం దేచెర్లలో ఎర్రమట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మట్టి తవ్వకాలు చేపట్టాలంటే మైనింగ్, రెవెన్యూ శాఖల నుంచి అనుమతులు పొందాల్సి ఉంది. కానీ ఇక్కడ మాత్రం కనీస అనుమతులు లేకుండా ఎర్రమట్టి దందాకు తెర లేపారు. టీడీపీ, జనసేన నేతల కనుసన్నల్లో దందా సాగుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీరి ధన దాహానికి దేచెర్ల సమీపంలోని ప్రాంతాలు గోతుల మయమయ్యాయి. కనుచూపు మేర ఎక్కడ చూసినా ఎర్రమట్టి తరలించగా ఏర్పడిన గోతులే దర్శనమిస్తున్నాయి. అక్రమ తవ్వకాలకు ఓ ఎమ్మెల్యే అండదండలు పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలున్నాయి. ఒక్కో ప్రాంతంలో 10 నుంచి 20 అడుగుల లోతు వరకు ఎడాపెడా తవ్వకాలు చేస్తున్నారు. పగలు, రేయి అన్న తేడా లేకుండా మట్టి తవ్వి తరలించేస్తున్నారు.

రోజుకు రూ.30 లక్షల ఆదాయం

కొవ్వూరు నియోజకవర్గం దేచెర్లలో 150 ఎకరాల్లో ఎర్రమట్టి దందా సాగుతోంది. ప్రతి రోజూ 200 లారీల్లో వివిధ ప్రాంతాలకు మట్టి తరలిస్తున్నారు. ట్రాక్టర్ మట్టి సుమారుగా రూ.5 వేలు, లారీకి రూ.8వేల నుంచి రూ.15 వేల వరకు దండుకుంటున్నట్లు సమాచారం. అంటే మట్టి మాఫియాకు ప్రతి రోజూ రూ.30 లక్షలకు పైగా ఆదాయం లభిస్తోంది. నెలకు రూ.9 కోట్లు కూటమి నేతల జేబుల్లోకి వెళుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిరాటంకంగా తవ్వకాలు సాగుతున్నాయి. దీన్ని బట్టిచూస్తే రూ.కోట్లు కూటమి నేతల జేబుల్లోకి వెళ్లినట్లు సమాచారం.



లారీ మట్టి రూ.8వేల నుంచి రూ.15 వేలకు విక్రయం

రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. సదరు లే అవుట్ల అభివృద్ధికి ఎర్రమట్టి అవసరం. ప్రధానంగా కడియం నర్సరీలకు ఎర్రమట్టి తప్పనిసరి. వీటితోపాటు ఇటుక బట్టీలలో సైతం వినియోగిస్తారు. ప్రభుత్వ అధికారిక మైనింగ్ క్వారీల నుంచి వీటిని తరలించుకోవాలంటే ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో పెద్ద ఎత్తున నగదు చెల్లించాల్సి ఉంటుంది. యూనిట్ గ్రావెల్‌కు రూ.320 మైనింగ్ శాఖకు చెల్లించాలి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ అక్రమ వ్యాపారంలో రూ.కోట్లు నష్టపోయే పరిస్థితి ఉంటుంది. ఈ డిమాండ్‌ను గమనించిన కూటమి దోపిడీ దారులు ప్రకృతి సంపదను కొల్లగొట్టి రూ.కోట్లు మింగడం కోసం వ్యూహాలు రచించారు. ఇందుకు దేచెర్ల గ్రామంలోని ఎర్రమట్టిని కేంద్రంగా చేసుకున్నారు. బడా నేతల అండదండలతో క్షేత్రస్థాయినేతలు రంగంలోకి దిగారు. ఎర్రమట్టి అక్రమంగా తరలించి రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. మైనింగ్ శాఖకు రావాల్సిన రూ.కోట్ల ఆదాయానికి గండికొడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

అక్రమ తవ్వకాలు కళ్లెదుటే సాగుతున్నా రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. వందల లారీలు అక్రమంగా మంటి తరిలించేస్తున్నా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారే తప్ప అడ్డుకున్న దాఖలాలు లేవు. ప్రతి నెలా మామూళ్లు దండుకుని మిన్నకుండి పోతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మట్టి మాఫియా ప్రతి నెలా రూ.లక్షల్లో మామూళ్లు సమర్పిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికితోడు అధికార పార్టీకి చెందిన నేతలు సూత్రధారులు కావడంతో అధికారులు అటు వెళ్లే సాహసం చేయడం లేదు. వచ్చింది చాల్లే అంటూ..జేబుల్లో వేసుకుంటూ కాలం గడిపేస్తున్నారు. మట్టి తరలింపు విషయమై ఇటీవల కొందరు మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తే.. ఆ గ్రామం ఎక్కడుంది..? ఎలా వెళ్లాలి..? అని ప్రశ్నించడాన్ని బట్టి చూస్తుంటే దోపిడీదారులకు ఎంతగా సహకరిస్తున్నారో అర్థం అవుతోంది.

న్యూస్‌రీల్

రత్నగిరిపై భక్తుల రద్దీ



రూ.రెండు వేల వ్రతమండపంలో సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం శుక్రవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిటకిట లాడింది. రత్నగిరిపై గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో వివాహాలు చేసుకున్న నవదంపతులు కూడా వారి బంధుమిత్రులతో కలసి సత్యదేవుని ఆలయానికి విచ్చేశారు. వీరంతా సత్యదేవుని వ్రతమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో నవ దంపతులు, వారి బంధుమిత్రులు, పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులతో స్వామివారి ఆలయం, ఆలయ ప్రాంగణం, విశ్రాంతి మంటపాలు, క్యూ లు నిండిపోయాయి. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించారు. సత్యదేవుని దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. అనంతరం రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణ చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

తల్లి ప్రోత్సాహంతోనే ఐపీఎస్

ట్రైనీ అసిస్టెంట్ ఎస్పీ సుస్మిత



కాకినాడ రూరల్: తల్లి ప్రోత్సాహంతో తాను ఐపీఎస్‌గాను, సోదరిణి ఐఏఎస్‌గా ఎంపికయ్యామని 2023 ఏపీ కేడర్ ఐపీఎస్‌గా ఎంపికైన తమిళనాడుకు చెందిన ఆర్.సుస్మిత తెలిపారు. అసిస్టెంట్ ఎస్పీగా జిల్లాలో ట్రైనీలో ఉన్న ఆమె శుక్రవారం కాకినాడ రూరల్ సర్కిల్ పరిధిలోని తిమ్మాపురం స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌ఓ) బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ తమిళనాడులోని కడలూరుకు చెందిన తమది వ్యవసాయ కుటుంబమన్నారు. తండ్రి వ్యవసాయం చేస్తారని, తల్లి ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్‌లో నాన్ టీచింగ్ స్టాఫ్‌గా పనిచేస్తున్నారన్నారు. తమ్ముడు చదువుకుంటున్నాడని, అక్కా, తాను ఐఏఎస్, ఐపీఎస్‌గా ఎంపికయ్యామన్నారు. తల్లి ప్రోత్సాహంతో తాను ఆరుసార్లు ప్రయత్నంతో ఐపీఎస్ సాధించానన్నారు. ఎస్‌హెచ్‌ఓగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చదువు ఆవశ్యత తెలియజేయడంతో పాటు గుడ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు గురించి అవగాహన కల్పించేందుకు ప్రాధాన్యం ఇస్తానన్నారు. తిమ్మాపురం స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో పాటు గంజాయి నిర్మూలనపై దృష్టి పెడతామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు గాను ఆర్టీఐ నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ముఖ్యంగా నంబరు ప్లేట్లపై దృష్టి పెడతామన్నారు. హెల్మెట్ ఆవశ్యకతను వివరిస్తామన్నారు.

సాంకేతికత సాయంతో పరీక్షలు

'నన్నయ' వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



అనుబంధ కళాశాలల ప్రతినిధులతో సమావేశమైన వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సకాలంలో ఫలితాలను వెల్లడించేందుకు ప్రయత్నం చేద్దామని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య ప్రసన్నశ్రీని గోదావరి జిల్లాలోని అనుబంధ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాల్స్ శుక్రవారం కలుసుకుని, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో 390 వరకు అనుబంధ కళాశాలలు ఉన్నాయన్నారు. సుమారు ఒక లక్ష మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. అన్ని కళాశాలల్లోనూ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కెమెరా మోనటరింగ్ విధానాన్ని అమలు చేయాలని చూస్తున్నామన్నారు. ఈ విధానాన్ని యూనివర్సిటీ నుంచి పర్యవేక్షిస్తారన్నారు. మారుమూల ఉన్న పరీక్షా కేంద్రాలను సందర్శించేందుకు సమయంతోపాటు ఖర్చు ఆదా అవుతుందన్నారు. నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలనే యూనివర్సిటీ సంకల్పానికి పూర్తి స్థాయిలో న్యాయం చేయవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కళాశాలలో ఫ్రెషర్స్ డేలు, డీజేలు, నృత్య ప్రదర్శనలను మానుకొని, సంప్రదాయానికి ప్రాధాన్యతినిచ్చేలా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్, డీన్‌లు ఆచార్య కేఎస్ రమేష్, డాక్టర్ డి.కల్యాణి, అనుబంధ కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- బ్లాక్ స్పాట్లలో లైటింగ్, సైన్ బోర్డ్, బ్లింకర్స్ ఏర్పాటుకు చర్యలు
- ప్రతి ఒక్కరూ స్వీయ రక్షణ కోసం హెల్మెట్, సీట్ బెల్ట్ ఉపయోగించాలి
- జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు



సమావేశంలో పాల్గొన్న జేసీ చిన్న రాముడు తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, అవగాహనతో పాటు నియమాలు పాటించే చొరవ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు విజ్ఞప్తి చేశారు. ప్రమాదం జరిగిన తొలి గంట గోల్డెన్ అవర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్నరాముడు అధ్యక్షతన జరిగింది. జేసీ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు విస్తతంగా నిర్వహించాలన్నారు. ప్రజలు స్వీయ రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో 27 జాతీయ, 6 రాష్ట్ర, 2 ఇతర రహదారులలో మొత్తం 35 బ్లాక్ స్పాట్స్‌లో గుర్తించామని, ఆయా ప్రాంతాలలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరిగాయన్నారు. రోడ్డు ప్రమాదాలను, మరణాలను తగ్గించడానికి కావలసిన జాగ్రత్తలు పాటించాలన్నారు. బ్లాక్ స్పాట్లలో లైటింగ్, సైన్ బోర్డ్, బ్లింకర్స్ సిగ్నల్ , జీబ్రా లైన్స్ , స్పీడ్ బ్రేకర్ లాంటివి ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాలు జరిగే చోట ఇక్కడ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలపాలని, సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారుల్లో కొన్ని ప్రదేశాల్లో ప్లాంటేషన్, లైటింగ్ చేపట్టాలన్నారు.

మోటార్ వాహనాల చట్టం పరిధిలో 2023 ఏడాదిలో 11,849 కేసులు నమోదు చేసి, రూ.10,32,72,000 జరిమానా విధించామని తెలిపారు. 2024లో 4,204 కేసులు నమోదు చేసి రూ.8,82,41,000 జరిమానా విధించామన్నారు. కోర్టు ఆధ్వర్యంలో 2023లో 45 కేసులకు రూ.67,500, 2024 లో 15 కేసులకు రూ.20 వేల అపరాధ రుసుం విధించినట్టు తెలిపారు. ప్రమాదం జరిగిన వ్యక్తిని గంటలోపు ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తే విలువైన ప్రాణాలు దక్కుతాయని తెలిపారు. నేషనల్ హైవే హెల్ప్ లైన్ (ఎమర్జన్సీ) నంబర్ 1033 పై విస్తతంగా అవగాహన కల్పించాలన్నారు. జాతీయ రహదారులపై ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

23న ఆర్‌బీసీ సీజన్ 2 హేవ్ లాక్‌షో



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: బౌ.. వావ్ పెట్ షాపీ, స్పా సమర్పణలో ఈ రాజమహేంద్రవరం జేఎస్ రోడ్‌లో ఈ నెల 23 న రాజమండ్రి బ్రీడ్ చాంపియన్‌షిప్ సీజన్ 2 హేవ్ లాక్ షో (డాగ్, కేట్ షో) నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తరుణ్ కలిం తెలిపారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 23 వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 4 గంటల నుంచి షో జరుగుతుందని తెలిపారు. రాజమండ్రి బ్రీడ్ చాంపియన్ షిప్ సీజన్ 1కి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వచ్చిందన్నారు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని సీజన్ 2 మరింత గ్రాండ్‌గా ప్లాన్ చేస్తున్నామన్నారు. ఉభయ గోదావరి జిల్లాలకు వారధిగా హేవ్ లాక్ బ్రిడ్జి నిలిచిందని, తాము నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాలకు వారధిగా నిలవాలని హేవ్ లాక్ షోగా నామకరణం చేశామన్నారు. ఈ షోలో 50 రకాల డాగ్స్, కేట్ బ్రీడ్‌లు పాల్గొంటాయన్నారు. సీజన్ 1 లో ఏపీ, తెలంగాణ, ఒడిశాల నుంచి బ్రీడ్‌లు పాల్గొన్నాయని, సీజన్ 2 కి కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా బ్రీడ్‌లు హాజరు అవుతాయన్నారు. చాంపియన్‌గా నిలిచిన డాగ్‌కు రూ.50 వేలు బహుమతి అందజేస్తామన్నారు. మన రాష్ట్ర బ్రీడ్ అయిన కొల్లేటి జాగిలం విశిష్టత తెలియజేసే విధంగా కొల్లేటి జాగిలం డాగ్ ప్రత్యేక షో జరుగుతుందన్నారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా తెలంగాణ కెన్నిల్ క్లబ్ కార్యదర్శి, కెన్నల్ క్లబ్ ఆఫ్ ఇండియా సభ్యులు విశాల్ సుదాన్, జడ్జిలుగా ప్రొఫెషనల్ ట్రైనర్‌లు టి.సతీష్‌గౌడ, జి.దినేష్‌గౌడలు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా షో పోస్టర్‌ను విడుదల చేశారు. విలేకర్ల సమావేశంలో శ్రీను, నాగేంద్ర, నాని, దీపక్, అఖిల్, బాజీ పాల్గొన్నారు.

ఆక్వాకు విద్యుత్ షాక్

- ఇప్పటికే అదనపు లోడ్ పేరుతో వాతలు
- చెప్పా పెట్టకుండా కరెంట్ కట్
- ఉప్పలగుప్తం సబ్ స్టేషన్ వద్ద చనిపోయిన చేపలతో నిరసన



ఉప్పలగుప్తం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద చనిపోయిన చేపలతో ఆక్వా రైతుల నిరసన

సాక్షి, అమలాపురం/ ఉప్పలగుప్తం: ఆక్వా రైతులకు కూటమి ప్రభుత్వం కోలుకోలేని విధంగా షాక్ ఇచ్చింది. రాయితీ విద్యుత్ ఇస్తున్నామంటూ ఒకవైపు గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం.. మరోవైపు అదనపు విద్యుత్ వినియోగానికి అపరాధ రుసుం.. కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వేసుకోవాలని మోయలేని భారం మోపుతోంది. విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తోంది. దీనితో రొయ్యలు, చేపలు చనిపోతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లిలో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో తమ చెరువుల్లో రూప్‌చందువా మృత్యువాత పడిందని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన రైతులతోపాటు చుట్టుపక్కల రైతులు శుక్రవారం రాత్రి విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. చనిపోయిన చేపలను పెద్ద ఎత్తున తీసుకువచ్చి కార్యాలయం ఎదుట వేసి నిరసన తెలిపారు. ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో చేపలు చనిపోయాయని వారు ఆరోపించారు. విద్యుత్ శాఖ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చెరువుల్లో చేపలను పెద్ద సంఖ్యలో సాగు చేస్తున్నామని, ఏరియేటర్ల ద్వారా ఆక్సిజన్ అందిస్తున్నామని వారు తెలిపారు. సరఫరా నిలిచిపోవడంతో చెరువులో డెడ్ ఆక్సిజన్ (డీవో) ఏర్పడి చేపలు చనిపోయాయని వారు వాపోయారు. తాము 18 ఎకరాల్లో సాగు చేస్తున్నామని, అధికారుల తీరుతో రూ.20 లక్షల వరకూ నష్టపోయామని ఆరోపించారు. రైతులు వస్తున్న సమాచారం తెలుసుకుని విద్యుత్ శాఖ సిబ్బంది కార్యాలయం వదిలి వెళ్లిపోయారు.

ఎమ్మెల్యేకు సఖినేటిపల్లి రైతుల మొర

రాజోలు దీవిలో సఖినేటిపల్లి మండలం అంతర్వేది, గొందికి చెందిన రైతులు సైతం విద్యుత్ సరఫరా నిలుపుదలపై మండిపడుతున్నారు. దీనిపై ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ వద్దకు సుమారు 200 మంది రైతులు వెళ్లి వినతిపత్రం అందజేశారు. అదనపు వినియోగం, పాత బకాయిల పేరుతో ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ కట్ చేస్తున్నారని వారు ఆరోపించారు. 'సీఎండీ ఆర్డర్లు అంటూ మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇలా రైతుల నడ్డివిరిచే చర్యలు ఏ ప్రభుత్వం కూడా చేయలేదు. ప్రభుత్వం ఏదైనా ప్రయోజనం చేకూర్చే పనులు చేయాలని' అని సొంత పార్టీ ఎమ్మెల్యే వద్ద ఆ పార్టీ అనుకూల ఆక్వా రైతులు వాపోవడం విశేషం. ప్రస్తుతం ఆక్వా ధరలు బాగున్నాయని, చెరువుల్లో పెద్ద ఎత్తున రొయ్యల పిల్లలు వదిలామని, ఈ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తే ఏరియేటర్లు పని చేయక చేపలు చనిపోయే ప్రమాదముందని వాపోయారు.

రూ.13.62 లక్షలకు నోటీసులు

జిల్లాలో కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడి తీర ప్రాంత గ్రామాల్లో వెనామీ, చేపల సాగు అధికం. ఇందులో రొయ్యల చెరువుకు ప్రభుత్వం రాయితీ విద్యుత్ అందిస్తోంది. కానీ అదనపు వినియోగం పేరుతో ఇటీవల భారీగా బిల్లులు భారం మోపుతున్నారు. అమలాపురం మండలం సవరప్పాలేనికి చెందిన ఒక రైతుకు అదనపు విద్యుత్ వినియోగం పేరుతో ఒక సర్వీసుకు రూ.60 వేలు, మరో సర్వీసుకు రూ.25 వేల బిల్లు పంపించారు. ఇప్పుడు ఈ రెండు సర్వీసులకు సంబంధించి చెరువుల వద్ద రెండు ట్రాన్స్‌ఫార్మర్లు వేయాలని తాజాగా నోటీసులు పంపారు. ఇందుకు ఒక్కదానికి రూ.6,95,900 లక్షలు, మరోదానికి రూ.6,66,981 చొప్పున మొత్తం రూ.13,62,881 చెల్లించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు వేయించుకోవాలని చెప్పారు. వెంటనే స్పందించనందున విద్యుత్ సరఫరా కూడా నిలిపివేశారు. ఇదే పరిస్థితి జిల్లాలో పలుచోట్ల ఉంది.

మహాశివరాత్రి ఉత్సవాలపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహకిషోర్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మహాశివరాత్రి పర్వదిన మహోత్సవాల ఏర్పాట్లను పక్కాగా నిర్వహించి, సమన్వయం చేసుకుని ఎటువంటి ఇబ్బందులు లేకుండా విజయవంతం చేయాలని కలెక్టర్ పి. ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 26వ తేదీ జిల్లాలోని అన్ని ప్రముఖ శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, డిఆర్‌ఓ టి.సీతారామమూర్తి, దేవదాయ, రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ , మత్స్యశాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నగరంలో, జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వున్న శైవక్షేత్రాల్లో వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు హాజరవుతారన్నారు. వారందరికీ ఎలాంటి లోటుపాట్లు, ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సీతానగరం మండలం వంగలపూడి నుంచి పట్టిసీమ వీరభద్రస్వామి దేవస్థానం, కొవ్వూరు గోష్పాద ఘాట్, రాజమహేంద్రవరం నగరంలో పుష్కర ఘాట్, మార్కండేయస్వామి దేవస్థానం ఘాట్, కోటిలింగాల ఘాట్‌కు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చెయ్యాలన్నారు. పట్టిసీమలో తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి వచ్చే భక్తులకు పుణ్య స్నానాలు, దర్శన సమాచారాన్ని అందించే విధంగా కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చెయ్యాలన్నారు. అదే విధంగా జిల్లాలోని అన్ని శైవక్షేత్రాల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఘాట్‌లో అవసరమైన బోట్లతో పాటు గజ ఈతగాళ్లను , పోలీసు సిబ్బందిని ఏర్పాటు చెయ్యాలన్నారు. జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలోని శివాలయాల వద్ద, ప్రాంతాల్లో శానిటేషన్ పనులు చేయాలన్నారు. అన్ని ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, 108 అంబులెన్స్‌కు, అందుబాటులో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయా శైవక్షేత్రాలకు అధిక సంఖ్యలో భక్తులు రానున్న సందర్భంగా ప్రతి చోటా మహిళలకు ఇబ్బంది లేకుండా పారిశుధ్యం, తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన



పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న జనసేన నాయకుడు సత్యనారాయణమూర్తి

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఉత్సవ సమన్వయ సమావేశంలో ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణలో జనసేన గౌరవాధ్యక్షుడు బదిరెడ్డి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. మార్చి 9వ తేదీ నుంచి జరగనున్న స్వామివారి కళ్యాణోత్సవాలను పురస్కరించుకుని పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికలకోడ్ ఉండగా జనసేన పార్టీకి చెందిన నాయకుడు బదిరెడ్డి సత్యనారాయణ మూర్తి, అధికారులతో పాటు పాల్గొనడం చర్చనీయాంశం అయ్యింది. రాజకీయపార్టీల నాయకుల ఇన్వాల్వ్‌మెంట్ ఉండకూడదన్న నిబంధనను అధికారులు విస్మరించారు. అన్నవరం దేవస్థానం ఈఓ సుబ్బారావు, రాజమహేంద్రవరం ఆర్డీ కృష్ణనాయక్, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బదిరెడ్డి పాల్గొనడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల కోడ్ కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

విద్యుత్ తీగ తెగిపడి తాటాకిళ్లు దగ్ధం



లోవకొత్తూరులో కాలిపోయిన తాటాకిళ్లు

తుని రూరల్: తుని మండలం లోవకొత్తూరు గ్రామంలో విద్యుత్ సర్వీస్ తీగలు తెగిపడడంతో మూడు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. శుక్రవారం జరిగిన ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన పెద్దాడ నూకరాజు, కాకాడ నాగలక్ష్మి, బత్తిన శ్రీరామ్మూర్తి ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం తెలియడంతో తుని నుంచి అగ్నిమాపక శకటం సంఘటనా స్థలానికి చేరుకుని సమీప ఇళ్లకు మంటలు వ్యాప్తి చెందకుండా అదుపు చేశారు. నూకరాజు, నాగలక్ష్మి, శ్రీరామ్మూర్తి కుటుంబాలు వేర్వేరు పనులకు వెళ్లిన తర్వాత విద్యుత్ లైను నుంచి ఇంటికి సరఫరా అయ్యే సర్వీసు తీగలు తెగిపడడంతో ఈ ప్రమాదం సంభవించినట్టు అగ్నిమాపక అధికారి కె.రాముడు తెలిపారు. సుమారు రూ.రెండు లక్షల ఆస్తినష్టం జరిగినట్టు వివరించారు. రూ.లక్ష నగదు, బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనం పూర్తిగా కాలి బూడిదైందని నూకరాజు కుటుంబ సభ్యులు వాపోయారు. బాధితులకు న్యాయం చేస్తామని, ఆర్థిక సాయం కోసం కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	18,500
గటగట (వెయ్యి)	16,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 - 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 - 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

కనులకు అందం.. కవలల బంధం

- రూపం ఒకటే.... శరీరాలు రెండు
- నేడు ప్రపంచ కవలల దినోత్సవం

బిక్కవోలు/ కరప: సృష్టిలో మనిషిని పోలిన మనుషులు ఏడుగురు ఉంటారని మన పెద్దలు చెబుతుంటారు.. అలాంటి ఏడుగురు మనకు కనిపిస్తారో లేదో తెలియదు కానీ మన చుట్టుపక్కల కవలలను చూస్తే నిజమేనని అనిపిస్తుంది. రూపం ఒకటే.. శరీరాలు రెండుగా ఉండే వీరిని చూస్తే ఆశ్చర్యం కలగదు మానదు. మా పేరేంటో చెప్పుకోండని వారు చిలిపిగా అడిగే ప్రశ్నకు రోజూ చూస్తున్న వారే తికమక పడుతుండడం చూస్తుంటాం.. అశ్వినీ దేవతలు, లవకుశలు కవలలని వేదాలు, పురాణాలు చెబుతున్నాయి. ఒకే రూపంలో ఉండే కవలలంటే ఇష్టపడని హృదయం ఉండదు. గతంలో ఎక్కడో కనిపించే కవలలు నేడు ఎక్కడికక్కడే దర్శనమిస్తున్నారు. అలాంటి కవలల దినోత్సవాన్ని జరుపుకోవడానికి వారు ఉత్సుకత చూపుతున్నారు. 1919లో పోలెండ్ దేశం బర్గ్ పట్టణంలో మోజేష్, ఆరెన్ విల్‌కార్స్ అనే కవలలు జన్మించారు. ఆడుతూ పాడుతూ జీవిస్తున్న వీరు ఒకే సమయంలో ఒకే రకమైన వ్యాధి సోకి మృతి చెందారు. ఆ దేశ నేతలు వారికి గుర్తుగా ఆ పట్టణాన్ని ట్విన్స్ బర్గ్‌తో పిలిచారు. అనంతరం 1976 ఫిబ్రవరి 22న ప్రపంచ కవలల దినోత్సవం నిర్వహించారు. అప్పటి నుంచి ఏటా జరుపుకొంటున్నారు.. ఈ నేపథ్యంలో మన చుట్టూ ఉండే కవలల గురించి తెలుసుకుందాం రండి..



ఒకే మేనరిజం

'వర్షిణి-వర్ధిని' అక్కాచెల్లెలు కొత్తపేటలో గుబ్బల మూర్తి-ఝాన్సీ దంపతుల కుమార్తెలైన వీరి ఇద్దరి రూపాల్లోనే కాదు అలవాట్లలో కూడా ఒకేలా ఉంటారు. ఒకే మేనరిజంతో వ్యవహరిస్తుంటారు. చదువులో, ఆటపాటల్లో ఇద్దరూ రాణిస్తుంటారు. టెన్త్‌లో ప్రథమ స్థానాలు సాధించారు. అయితే వేరు వేరు లక్ష్యాలతో ముందుకు వెళుతున్నారు. ప్రస్తుతం ఆలమూరు మండలం చెముడులంకలోని ఒక ప్రైవేట్ జూనియర్ కాలేజీలో ఒకరు ఎంపీసీ, మరొకరు బైపీసీ చదువుతున్నారు. వర్షిణి-వర్ధిని, కొత్తపేట

ఎప్పుడూ కలిసే ఉంటాం..



ఆహారం విషయాల్లో మా ఇద్దరి ఆలోచన ఒకేలా ఉండదు. మిగతా విషయాల్లో ఒకేలా అనుకుంటాం. చదువుతో పాటు అన్ని విషయాలు తల్లిదండ్రులు కోరిక మేరకే చేస్తుంటాం. ఎప్పుడూ కలిసే ఉంటాం.

–దొంతంశెట్టి త్రిపుర, తేజశ్రీ, కొంకుదురు సావరం

చదువులో తప్ప..



అక్షత, ఆస్రితలు ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నారు. వీరి చదువులో తప్ప మిగతా అన్నింట్లో ఒకే అభిరుచి కలిగి ఉంటున్నారు. అక్షత చదువులో మరింత బాగా చదువుతుంది. వారు తినే ఆహారం నుంచి వేషధారణ వరకూ ఇద్దరూ ఒకే రకంగా ఇష్టపడుతున్నారు.

–ఆకే అక్షత, ఆస్రిత, పందలపాక

అందుకే పెద్దోడినయ్యా..



మా ఇద్దరం కేవలం 20 నిమిషాల వ్యవధిలో జన్మించారు. అందువల్ల నేను అన్నయ్యను అయిపోయాను. పేరుకే అన్నయ్యను. కానీ తను ప్రతి విషయంలో నా కంటే ముందుగా ఆలోచిస్తుంది. నాకు అక్కలా సలహాలు ఇస్తుంది. మా ఇద్దరి ఆలోచనలు, అభిరుచి ఒకేలా ఉంటాయి.

–తనుజశ్రీ పల్లవి, తరుణ్ శ్రీతేజ్, జి.మామిడాడ

తికమక పడుతుంటారు..



మా ఇద్దరినీ చూసి అందరూ తికమక పడుతుంటారు. గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాం. మా రూపం, చేష్టలు ఒకేలా ఉండడంతో మా తల్లిదండ్రులు మమ్మల్ని ఎంతో ఇష్టంగా చూస్తున్నారు.

–పంపన దేవి, పంపన లక్ష్మి, దవిపూడి, కరప మండలం



మా పేరేంటో చెప్పుకోండి

మమ్మల్ని చూసిన ఎవరైనా మా పేర్లు మార్చి పిలుస్తుంటారు. చాలా కన్‌ఫ్యూజ్ అవుతుంటారు. మేము పెద్దాపురప్పాడు బిరుదా ఫకీర్రావు (సూర్యనారాయణ) జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాం. ఒకే రూపంతో జన్మించడం అదృష్టంగా భావిస్తున్నాం.

–గొల్లపల్లి జోహిత, జోషిత, పెద్దాపురప్పాడు

ఒకే పోలిక.. చూసేవారికి తికమక

ఈ అక్కాచెల్లెళ్లను చూసిన వారు తికమిక పడుతుంటారు. అమలాపురంలోని ఓ ప్రైవేట్ స్కూలులో వీరు 7వ తరగతి చదువుతున్నారు. వీరిద్దరి ఇష్టాలు, అభిరుచులు ఇకేలా ఉంటున్నాయి. బంధువులు, స్నేహితులు వచ్చినప్పుడు ఎవరు నవ్య, ఎవరు భవ్య తెలుసుకునేందుకు చాలా కష్టపడుతుంటారు.

–రమనశినిశ్రీ, వేణు రమణి భాగ్యశ్రీ, అమలాపురం



సేకరించిన భూములు స్వాధీనం చేసుకోండి

- ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు
- రియల్ ఎస్టేట్ మాయలో రైతులు పడవద్దు



రైల్వే లైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, కోనసీమ రైల్వే సాధన సమితి సభ్యులు

అల్లవరం: కోటిపల్లి – నరసాపురం రైల్వేలైన్ నిర్మాణానికి 25 ఏళ్ల కిందట రైతుల నుంచి సేకరించిన భూమిని కలెక్టర్ స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. వైనతేయ నదిపై బోడసకుర్రు వద్ద నిర్మాణ దశలో ఉన్న రైల్వేలైన్ పనులను కోనసీమ రైల్వే సాధన సమితితో కలసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఇరవై ఐదేళ్ల క్రితం కోటిపల్లి నుంచి అమలాపురం వరకూ భూసేకరణ పూర్తి చేసి 80 శాతం పరిహారాన్ని రైల్వే బోర్డు ఇచ్చి రైతుల నుంచి భూ రిజిస్ట్రేషన్ చేసిందన్నారు. ఇప్పుడు మార్కెట్ ధరలు బాగా పెరిగాయని అప్పట్లో ఇచ్చిన పరిహారం సరిపోదని కొంత మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారని పలు దినపత్రికల్లో వచ్చిందని ఎమ్మెల్సీ అన్నారు. రైల్వే చట్టం ప్రకారం రైతులకు పరిహారం అందించిన తర్వాత కోర్టును ఆశ్రయించి పనులు నిలుపుదల చేయడం సాధ్యం కాదన్నారు. అమలాపురానికి చెందిన కొంత మంది రియల్ ఎస్టేట్‌దారులు విశ్రాంతి రెవెన్యూ అధికారుల సహకారంతో కోర్టుల ద్వారా పనులను అడ్డుకుంటున్నారని తెలిపారు. వీరి మాయలో రైతులు పడవద్దని హితవు పలికారు. ఇప్పటికే అన్ని నదుల ఫిల్లర్లు పూర్తి చేసుకుని ట్రాక్ పనులు ప్రారంభం కానున్నాయన్నారు. రైల్వే బోర్డుకు భూములు ఇచ్చిన రైతుల నుంచి భూములు స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. కోనసీమ రైల్వే సాధన సమితి సభ్యులు కల్వకొలను తాతాజీ మాట్లాడుతూ కోనసీమ ప్రజల చిరకాల కోరిక తీరనున్న తరుణంలో హైకోర్టుని ఆశ్రయించి స్టే తేవడం దురదృష్టకరమన్నారు. కోనసీమ రైల్వేలైన్ కోసం ఇరవై ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. గతంలో భూమికి పరిహారం పొందుతూ నేటికి ఆ భూముల్లో పంటలు పండించుకుంటూ ఆదాయం పొందుతున్నారని, ఇటీవల కాలంలో భూమి రెట్లు పెరిగాయని, ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ఇవ్వాలని అడగడం భావ్యం కాదన్నారు. రైల్వే లైన్‌పై కోర్టుకు వెళ్లడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

కోనసీమకు రైలును తీసుకొస్తానని, బాలయోగి చిరకాల కోరికను తాను తీరుస్తానని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ చెప్పారని అన్నారు. ఇలాంటి తరుణంలో అడ్డంకులు రావడం చాలా బాధాకరమని, కోనసీమ రైలు వచ్చేంత వరకు జిల్లా ప్రజలు కృషి చేయాలని తాతాజీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోనసీమ సాధన సమితి కన్వీనర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, సభ్యులు పోలిశెట్టి శివాజీ, ఉప్పుగంటి భాస్కరరావు, బాబీ గాబ్రియేల్ పాల్గొన్నారు.

ముద్దాయికి పదేళ్ల జైలు

ఐ.పోలవరం: ప్రేమిస్తున్నానని చెప్పి నమ్మించి శారీరకంగా మోసం చేసిన కేసులో ఓ వ్యక్తికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. ఐదు వేల జరిమానాను రాజమహేంద్రవరం 8వ కోర్టు కం క్రైమ్ ఎగినెస్ట్ ఉమెన్ కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ కథనం ప్రకారం.. ఐ.పోలవరం మండలం పశువుల్లంక గ్రామానికి చెందిన బాధితురాలు 2019 నుంచి గ్రామంలో వలంటీరుగా పనిచేశారు. అదే సచివాలయంలో తాళ్లరేవు మండలం చిన గోవలంక గ్రామానికి చెందిన కాశి మధుబాబు వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేశారు. కాశి మధుబాబు బాధితురాలిని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకొంటానని నమ్మబలికి మోసం చేశాడు. దీనిపై 2022 డిసెంబర్ 13న ఐ.పోలవరం పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై రాజమహేంద్రవరం ఉమెన్స్ కోర్టులో వాదనల అనంతరం జడ్జి వై.బెన్నయ్య నాయుడు పైవిధంగా తీర్పు చెప్పారు.

చోరీ కేసులో ముగ్గురికి ఏడాది జైలు

కాకినాడ లీగల్: ఇంట్లోకి ప్రవేశించి మహిళ నోటిలో రుమాలు కుక్కి బీరువాలోని రూ.8 లక్షలు, వెండి, బంగారు ఆభరణాలు చోరీ చేసిన ముగ్గురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ కాకినాడ ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ షరీన్ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు గ్రామానికి చెందిన మల్లాడి దుర్గాప్రసాద్, కాకినాడ ఏటిమొగ ప్రాంతానికి చెందిన డొక్కాడి మహేష్, పేసింగి ప్రసాద్ కలసి 2023 ఏప్రిల్ 30న కాకినాడ రూరల్, ఇంద్రపాలెం మార్కెట్ సమీపంలో ఉంటున్న వెదుళ్లపల్లి సుధారాణి ఇంట్లోకి రాత్రి 8 గంటల సమయంలో వెళ్లి ఆమెను నోటిలో రుమాలు కుక్కారు. బీరువాలో ఉన్న రూ.8 లక్షలు, వెండి, బంగారు ఆభరణాలు చోరీ చేశారు. దీంతో సుధారాణి ఇంద్రపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో నిందితుల నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి ఏడాది జైలు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మూడు మట్టి లారీల సీజ్



తనిఖీల్లో సీజ్ చేసిన మట్టి లారీ వద్ద టాస్క్‌ఫోర్స్ అధికారులు

రావులపాలెం: ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న మూడు లారీలను రావులపాలెం మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం రాత్రి సీజ్ చేశారు. తహసీల్దార్ ముక్తేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో అక్రమంగా, అనుమతులు లేకుండా బొండు మట్టిని తరలిస్తున్న మూడు లారీలను స్థానిక ఊబలంక, రావులపాలెం రోడ్డులో తనిఖీల్లో పట్టుకున్నారు. ఒక్కో లారీకి రూ.15 వేల చొప్పున మొత్తం రూ. 45 వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మోటార్ సైకిల్ చోరీ

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయం పార్కింగ్ స్థలంలో ఉంచిన తన ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్టు రామచంద్రపురానికి చెందిన కొనసా కామేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 16వ తేదీన భీమేశ్వరాలయానికి ఆయన కుటుంబ సభ్యులతో కలసి వెళ్లారు. దైవ దర్శనం అనంతరం తిరిగొచ్చేసరికి వాహనం కనిపించలేదు. ఈ మేరకు ద్రాక్షారామ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ తెలిపారు.

ఉత్కంఠగా ఆలిండియా హాకీ పోటీలు



క్యాంప్ ఫైర్‌లో నృత్యాలు చేస్తూ సందడి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కల్చరల్, స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ పురుషులు, మహిళల పోటీలు శుక్రవారం ఉల్లాసంగా జరిగాయి. శుక్రవారం నిర్వహించిన మ్యాచ్‌లను చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రవి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. మహిళల విభాగంలో రాజస్థాన్ సెక్టార్, ఏపీ సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఏపీ సెక్టార్ 15-0 స్కోర్‌తో, సెంట్రల్ సెక్టార్, కేరళ సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో సెంట్రల్ సెక్టార్ 5-0 స్కోర్‌తో, ఛత్తీస్‌ఘడ్ సెక్టార్, మధ్యప్రదేశ్ సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌ఘడ్ 22-0 స్కోర్‌తో విజయం సాధించాయి. పురుషుల విభాగంలో మధ్యప్రదేశ్ సెక్టార్, మహారాష్ట్ర సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర సెక్టార్ 6-2 స్కోర్‌తో, ఆర్బీఎస్ కాన్పూర్, ఆర్బీఎస్ జైపూర్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్బీఎస్ కాన్పూర్ 4-2 స్కోర్‌తో గెలుపొందాయి. ఛత్తీస్‌ఘడ్ సెక్టార్, ఉత్తర్‌ప్రదేశ్ సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌ఘడ్ 5-0 స్కోర్‌తో విజయం సాధించాయి.

అలరించిన క్యాంప్ ఫైర్

ఆలిండియా హాకీ పోటీల సందర్భంగా శుక్రవారం రాత్రి క్రీడా మైదానంలో క్యాంప్ ఫైర్ నిర్వహించారు. ఈ క్యాంప్ ఫైర్‌ను కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ మీనా, ఎస్పీ బిందుమాధవ్ ప్రారంభించారు. పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఆయా రాష్ట్రాల సంప్రదాయ నృత్యాలతో అలరించారు. ఉల్లాసంగా, సంతోషంగా గడిపారు. ఈ క్యాంప్ ఫైర్‌లో డీఆర్వో వెంకట్రావు, ఆర్డీఓ మల్లిబాబు, డీఎస్డీఓ బి.శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆలిండియా హాకీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కామనగరువులో రోడ్డు ప్రమాదం

ఒకరి మృతి, మరొకరి గాయాలు



మృతి చెందిన గోలకోటి రమేష్

అమలాపురం రూరల్: కామనగరువులో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో వ్యక్తిని స్థానికులు రక్షించారు. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపేట మండలం ఆర్లపల్లి గ్రామం కండ్రిగపాలేనికి చెందిన తాపీమేస్త్రి గోలకోటి రమేష్ (45), మోడేకుర్రు గొలకోటివారిపాలేనికి చెందిన గునిశెట్టి సోమసుందర్ శేఖర్‌లు తోడల్లుళ్లు. ఇద్దరూ కలిసి మోటార్ సైకిల్ పై రాజోలు మండలం తాటిపాకకు ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లారు. పెళ్లి తెల్లవారుజామున కావడంతో భోజనం చేసిన ఇద్దరూ మోటార్ సైకిల్ పై అత్తారిల్లు ఉప్పలగుప్తం మండలం చీకట్లవారిపాలేనికి బయలుదేరారు. కామనగరువు వద్దకు వచ్చేసరికి పంట బోదెకు రక్షణ గోడ లేకపోవడంతో అదుపుతప్పి నరాసరి మోటార్ సైకిల్‌తో సహా బోదెలోకి వెళ్లిపోయారు. అర్ధరాత్రి కావడంతో ఎవరూ గమనించలేదు. కానీ కుక్కలు పదేపదే అరవడంతో దొంగల బెడద కారణంగా ఆ పక్కనే ఉన్న రాజులపూడి భాస్కరరావు కుటుంబ సభ్యులు లేచారు. పంట బోదె వద్దే కుక్కలు అరవడంతో అక్కడకు వెళ్ళి చూసేసరికి మోటార్ సైకిల్, ఇద్దరు బోదెలో పడిపోయి ఉన్నారు. వెంటనే స్పందించి 108కు, పోలీసులకు సమాచారం అందించారు. గొలకోటి రమేష్ అప్పటికే ప్రాణాలు కోల్పోయాడు. తీవ్ర గాయాలతో ఉన్న సోమసుందర్ శేఖర్‌ను స్థానికులు బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. శేఖర్‌ను అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పంట బోదెకు కల్వర్టు లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందంటూ మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని ఎన్నిసార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదంటూ మండి పడుతున్నారు. మృతుని సోదరుడు గొలకోటి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఆర్ గోపాలకృష్ణ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

అంబాజీపేట: మాచవరం శివారు పోతాయిలంకకు చెందిన ఓ వ్యక్తి అదృశ్యంపై అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మట్టపర్తి వెంకటేశ్వరరావు ఈ నెల 18 నుంచి కనిపించడం లేదు. వెంకటేశ్వరరావు ఇంటి నుంచి వెళ్లే సమయంలో గులాబీ కలర్ షర్టు, నేవీ బ్లూ ఫ్యాంటును ధరించి 5 అడుగుల ఎత్తు ఉంటాడన్నారు. వెంకటేశ్వరరావు కుమారుడు శ్రీరామమూర్తి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన ట్రాలీ

ముగ్గురికి తీవ్ర గాయాలు



వంగలపూడి వద్ద ఏటిగట్టుపై నుంచి ఇంట్లోకి దూసుకెళ్లిన ట్రాలీ

సీతానగరం: మండలంలోని వంగలపూడిలో ఏటిగట్టు పైనుంచి భారీ ట్రాలీ ఇంట్లోకి దూసుకు వెళ్లడంతో నిద్రిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలవరం ప్రాజెక్ట్ వద్దకు వెళ్తున్న ఖాళీగా భారీ ట్రాలీ గురువారం అర్ధరాత్రి 2.30 (తెల్లవారితే శుక్రవారం) గంటలకు వంగలపూడి ఏటిగట్టుపై నుంచి నేరుగా గట్టు ఆనుకుని ఉన్న చిట్రోతు వెంకటేశ్వరరావు తాటాకు ఇంట్లోకి దూసుకెళ్లింది. ఇంట్లో నిద్రిస్తున్న చిట్రోతు వెంకటేశ్వరరావు, అతని కుమార్తె దుర్గ, ఇద్దరు మనుమరాళ్లపై మట్టి గోడలు విరిగిపడ్డాయి. పెద్ద శబ్దం రావడంతో చుట్టుపక్కల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచారు. మట్టిగోడల కింద ఉండి కేకలు వేస్తున్న నలుగురిని బయటకు తీసి కాపాడారు. అప్పటికే వెంకటేశ్వరరావు, కుమార్తె దుర్గ, మనుమరాలు పావనిలకు తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై డి.రామ్‌కుమార్ పరిశీలించారు.

పాఠశాలలో ఐఎఫ్‌పీ చోరీ



పాఠశాలలో వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

రామచంద్రపురం రూరల్: తాళ్లపొలం ఎంపీయూపీ పాఠశాల నుంచి రూ.లక్షకు పైగా విలువైన ఐఎఫ్‌పీ(ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్) చోరీకి గురైంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దీనిని సమకూర్చింది. పది రోజుల క్రితం ఈ ప్యానల్‌ను దొంగిలించేందుకు దొంగలు విఫలయత్నం చేశారు. కటకటాల్లో టీవీ ఇరుక్కుపోవడంతో వదిలి వెళ్లిపోయారు. గతేడాది ఇదే పాఠశాలలో రెండు సిలిండర్లు చోరీకి గురయ్యాయి. అప్పట్లో ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయింది. తాజాగా దొంగలు ఈ ప్యానల్‌ను అపహరించారు. హెచ్ఎం బొలిశెట్టి లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు. అమలాపురం క్లూస్ టీం ఆధారాలు సేకరించింది.

తీరు మారలేదు..!



ఉదయం 10.40 గంటలకు సత్యదేవుని నిత్య కల్యాణం ప్రారంభించిన పండితులు

- గంట ఆలస్యంగా సత్యదేవుని నిత్య కల్యాణం
- అధికారులను వివరణ కోరతానన్న ఈఓ

అన్నవరం: అన్నవరంలోని శ్రీవీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో శుక్రవారం సత్యదేవుని నిత్య కల్యాణం సుమారు గంట ఆలస్యంగా ప్రారంభమైంది. ఎల్ఐసీ సంస్థకు చెందిన కొంతమంది భక్తులు నిత్య కల్యాణ మండపంలో వ్రతాలాచరించడంతో ఈ కార్యక్రమం ఆలస్యమైంది. వాస్తవానికి కార్తిక మాసంలోనూ స్వామివారి నిత్య కల్యాణ మండపంలో వ్రతాలు నిర్వహిస్తుంటారు. ఆ సమయంలో కల్యాణ భక్తులకు ఇబ్బంది లేకుండా పాత కల్యాణ మండపంలో యథావిధిగా కల్యాణం చేస్తుంటారు. అయితే శుక్రవారం అటువంటి ఏర్పాట్లు చేయలేదు. ముందుగా ప్రకటించలేదు. సత్యదేవుని నిత్యకల్యాణం ఆచరించే భక్తులు ఉపవాసంతో ఉంటారు. ఉదయం 9-30 కి నిత్యకల్యాణం ప్రారంభించి 11 గంటలకల్లా పూర్తి చేస్తారు. అటువంటిది నిత్యకల్యాణ మండపంలో వ్రతాలు నిర్వహించినందున శుక్రవారం ఉదయం 10.40 గంటలకు కల్యాణం ప్రారంభించి, మధ్యాహ్నం 12-20 గంటలకు పూర్తి చేశారు. కల్యాణం ఆచరించేందుకు టిక్కెట్లు తీసుకున్న భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వారు కల్యాణం అయ్యాక సత్యదేవుని దర్శనానికి ఆలయానికి వెళ్లగా మధ్యాహ్నం నివేదన కారణంగా ఆలయ తలుపులు అరగంట మూసేశారు. ఒంటి గంటకు ఆలయ తలుపులు తీశాక స్వామివారి దర్శనం చేసుకుని వచ్చేటప్పటికీ మధ్యాహ్నం 1-30 గంటలు అయ్యింది. కల్యాణం ఆలస్యం కావడానికి గల కారణాలపై సంబంధిత విభాగ అధికారులను వివరణ కోరతానని దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు అన్నారు. ఎల్ఐసీ వారు నిత్యకల్యాణ మండపంలో వ్రతాలాచరించడానికి పర్మిషన్ అడిగితే ఇచ్చామన్నారు.